సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కైలాసగిరి ఘాట్ రోడ్డులో బైక్ - కారు ఢీ

ఆరిలోవ: పర్యాటక కేంద్రం కైలాసగిరి ఘాట్ రోడ్డుపై శుక్రవారం పెద్ద ప్రమాదం తప్పింది. ఘాట్ రోడ్డులో ఎదురెదురుగా ప్రయాణించే ద్విచక్ర వాహనం, కారు ఢీకొన్నాయి. వివరాలిలా.. కై లాసగిరి కొండ పైనుంచి కిందకు వస్తున్న ఓ కారు.. కింది నుంచి పైకి వెళ్తున్న ద్విచక్ర వాహనం ఘాట్ రోడ్డులో రెండో మలుపు వద్ద ఒకదానికొకటి ఢీకొన్నాయి. కారు, బైక్ ముందు భాగాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఇరువురు మాట్లాడుకుని ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఈ సంఘటనతో కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆరిలోవ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. సంఘటనలో ప్రాణాపాయం లేకపోవడంతో పోలీసులు, పర్యాటకులు ఊపిరి పీల్చుకున్నారు. కింద నుంచి కొండపైకి వెళ్తుండగా రెండో మలుపు వద్ద ఎదురెదురు వాహన చోదకులు ఒకరికొకరు కనిపించరు. ఇక్కడ రోడ్డు పక్కన అద్దాలు ఏర్పాటు చేసే చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

బయోడైవర్సిటీ పార్క్ సందర్శన



పార్క్‌లో మొక్కను పరిశీలిస్తున్న విద్యార్థులు

బీచ్‌రోడ్డు: పెందుర్తికి చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థులు శుక్రవారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. వారికి పార్క్ పర్యవేక్షకుడు రామమూర్తి వివిధ రకాల మొక్కల విశేషాలను వివరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ దేవీ శంకర్, శేషకిరణ్ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు వితరణ



పేద విద్యార్థులకు ఆట వస్తువులు అందిస్తున్న సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులు

ఎంవీపీకాలనీ: సత్యసాయిబాబా 99వ జయంతిని పురస్కరించుకుని శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఎంవీపీ కాలనీ లెబన్ హిల్స్ దివ్యాంగుల పాఠశాల, లీనా చారిటబుల్ ట్రస్ట్, స్కూల్ ఫర్ డెఫ్ అండ్ డంబ్, కేర్ అండ్ లవ్ అనాథాశ్రమాల్లో విద్యార్థులకు, దివ్యాంగులకు స్థానిక సత్యసాయి విద్యావిహార్ 9డీ, 9ఈ విద్యార్థులు పండ్లు, దుప్పట్లు, దుస్తులు, నిత్యావసర సరకులు, ఆట సామగ్రితో కూడిన కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి విద్యావిహార్ ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ ఫైబర్‌నెట్‌లో బాక్సుల కొరత

- త్వరలోనే అధిగమిస్తాం
- ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ చైర్మన్ జీవీ రెడ్డి

విశాఖ విద్య: ఏపీ ఫైబర్‌నెట్‌లో బాక్సుల కొరత ఉందని, దీన్ని త్వరలోనే అధిగమిస్తామని ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ చైర్మన్ జీవీ రెడ్డి అన్నారు. ఆంధ్ర యూనివర్సిటీలోని ఏపీ ఫైబర్ నెట్‌వర్క్ ఆపరేషన్ సెంటర్‌ను శుక్రవారం జీవీ రెడ్డి సందర్శించారు. ఫైబర్ నెట్ ఉద్యోగులతో సాంకేతిక విషయాలపై చర్చించారు. ప్రస్తుతం నెలకొన్న సాంకేతిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం బాక్సుల కొరత ఉందని, త్వరలోనే ఆపరేటర్లు అందరికీ ఫైబర్ నెట్ బాక్సులను అందిస్తామన్నారు. ఈ విషయంలో ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

ఏపీజీఎల్ఐ సేవలపై అవగాహన కల్పించండి

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వ జీవిత బీమా సంస్థ(ఏపీజీఎల్ఐ) జోన్-1 శాఖాధిపతి రెడ్డి శ్రీనివాస్ శుక్రవారం విశాఖలో పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా ఏపీజీఎల్ఐ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. పాలసీదారులకు రుణాలు మంజూరు చేయడం, క్లెయిమ్‌లను పరిష్కరించడం వంటి అంశాల్లో కార్యాలయ సిబ్బంది పనితీరును ఆయన అభినందించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఈ సంస్థ అందిస్తున్న సేవల గురించి మరింత అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్ర సహాయ సంచాలకులు ఎ.ఆర్.కె నాయుడు, ఉమ్మడి విశాఖ ఏపీజీఎల్ఐ కార్యాలయ సంయుక్త సంచాలకులు ఎం.ఝాన్సీ లక్ష్మి, సహాయ సంచాలకుడు కె.కనికరం బాబు, పర్యవేక్షకుడు జి.మధుసూదనరావు పాల్గొన్నారు.

నత్తనడకన యూజీడీ పనులు

- 22వ వార్డులో ఆరు నెలలుగా సా..గుతున్న వైనం
- రోడ్లపైనే తవ్విన మట్టి, సిమెంట్ వ్యర్థాలు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహన చోదకులు

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులో భూగర్భ డ్రైనేజీ పనులు నత్తనడకన సా...గుతున్నాయి. సుమారు కోటి రూపాయలతో రెండు దఫాలుగా పనులు ప్రారంభించారు. వార్డులోని మొత్తం రోడ్లను తవ్వి నెమ్మదిగా పనులు చేస్తుండటంతో వాహనాలు, పాదచారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా పిఠాపురం కాలనీ, శివాజీ పాలెం, పీతలవానిపాలెం ప్రాంతాల్లో స్థానికులు నడవడానికి, విద్యార్థులు స్కూల్‌కు వెళ్లడానికి కూడా సరైన మార్గం లేక అవస్థలు పడుతున్నారు.

నేటికీ పూర్తికాని పనులు

వార్డులో మొదటి దఫా పనులు ఆరు నెలల కిందట ప్రారంభం కాగా.. ఇప్పటికీ పూర్తి కాలేదు. రహదారులను మొత్తం తవ్వి యూజీడీ లైన్ వేశారు. వాటి పునర్నిర్మాణంలో మాత్రం కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వహిస్తున్నారు. వీధుల్లో గోతుల రోడ్లతో వాహన చోదకులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే రహదారులు మొత్తం బురదతో నిండిపోయేవి. గత ఆరు నెలల కాలంలో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



పీతలవానిపాలెంలో రోడ్డుపై వదిలేసిన సిమెంట్ వ్యర్థాలు

మట్టి తవ్వి వదిలేశారు..



పిఠాపురం కాలనీలో తవ్వి వదిలేసిన రోడ్డు

వార్డులో నెల రోజుల కిందట రెండో దఫా పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా రోడ్లను తవ్వించిన కాంట్రాక్టర్‌ను ఆ సిమెంట్ దిమ్మలను గాని.. మట్టిని గాని తరలించకుండా అలా విడిచి పెట్టేశాడు. దీంతో వీధుల్లో నివసిస్తున్న ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలంటే కష్టంగా మారింది. తవ్విన మట్టిని, సిమెంట్ దిమ్మెలను ఏ రోజుకారోజు తరలించాల్సి ఉంది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, జీవీఎంసీ సిబ్బంది పర్యవేక్షణ లోపంతో రోజులు గడుస్తున్నా తవ్వినా మట్టి, సిమెంట్ వ్యర్థాలు అక్కడే ఉంటున్నాయి.

వేగంగా పనులు పూర్తి చేయాలి

స్థానికులకు, వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా యూజీడీ పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని 22వ వార్డు ప్రజలు కోరుతున్నారు. కొన్ని చోట్ల యూజీడీ పనుల్లో నాణ్యత లేదని, లీకేజీలు ఉన్నాయని చెబుతున్నారు. దీనిపై జీవీఎంసీ అధికారులు దృష్టి సారించి, వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

26న ఏయూలో అవంత్స, ఆరుద్రల శత జయంత్యుత్సవం



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు శాఖ, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం సంయుక్తంగా ఈ నెల 26న ఏయూ టీఎల్ఎన్ సభా హాల్‌లో అవంత్స సోమసుందర్, ఆరుద్రల శత జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. కార్యక్రమ ఆహ్వాన పత్రికలను శుక్రవారం ఆయన తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. వీసీ మాట్లాడుతూ మహాకవులు అవంత్స, ఆరుద్ర శత జయంతి ఉత్సవ నిర్వహణకు యూనివర్సిటీ వేదిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉత్సవాలు జయప్రదానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య జర్రా అప్పారావు, అభ్యుదయ రచయితల సంఘం ప్రతినిధులు ఉప్పల అప్పలరాజు, డాక్టర్ సి.ఎస్.క్షేత్రపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక ప్రదర్శన జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న సీఐటీయూ నేత కుమార్

మద్దిలపాలెం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 26న దేశవ్యాప్తంగా చేపట్టనున్న నిరసన ప్రదర్శనలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ పిలుపునిచ్చారు. మద్దిలపాలెం ఆటోమోటివ్ వద్ద శుక్రవారం నిర్వహించిన ముఠా కలాసీల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడో సారి అధికారంలోకి వచ్చి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను దూకుడుగా అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్ర విధానాలకు మద్దతు పలకడం వల్ల కార్మిక వర్గానికి, రైతులు నష్టదాయకమన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతామన్న కూటమి ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులను అక్రమంగా తొలగిస్తున్నా, పర్మినెంట్ కార్మికులను వీఆర్ఎస్ పేరుతో బయటకు నెట్టేస్తున్నా చోద్యం చూస్తోందని విమర్శించారు. ఈ నెల 26న దొండపర్తి డీఆర్ఎం ఆఫీస్ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన జరుగుతుందని, కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కార్యదర్శి పి.వెంకటరావు, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారావు, మేస్త్రిలు రమణ, శ్రీను, రెడ్డి, నరసింహ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలు సంభవిస్తే కఠిన చర్యలు



సమీక్షిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని, లేదంటే సంబంధిత వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం రేసపువానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మాతృ మరణాలపై ఆయన అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ఇటీవల రెండు మాతృ మరణాలు సంభవించాయని, వాటిపై సంబంధిత వైద్యులు, ఆరోగ్య సిబ్బంది కారణాలు చెప్పాలని కోరారు. వీటిపై యూపీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలతో చర్చించారు. లక్ష్మీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒకటి, స్వర్ణభారతి పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధి న్యూపిఠాపురం కాలనీలో ఒక మాతృ మరణం సంభవించాయని అన్నారు. గర్భిణిగా నమోదు అయినప్పటి నుంచి ప్రసవించే వరకు, ప్రసవానంతరం సైతం సక్రమ సేవలందించాలని తెలిపారు. ఈ సమీక్షలో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌరీ శంకర్, ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.జీవనరాణి, మీడియా విస్తరణాధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, కేజీహెచ్ గైనకాలజిస్ట్ డాక్టర్ షర్మిల, డాక్టర్ రేణుక, విక్టోరియా ఆస్పత్రి గైనకాలజిస్టు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ రేణుక, డాక్టర్ జి.వి.గణేష్, డాక్టర్ సి.బి.నాయుడు, బ్లడ్ బ్యాంకుకు చెందిన ఐ.మనోరమ, 108 సేవల జిల్లా మేనేజర్ త్రినాథ్, ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, పినాకిల్ ఆస్పత్రి, కృష్ణ మెటర్నిటీ ఆస్పత్రి, జ్యోతి నర్సింగ్ హోం వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మైల్ కార్యాలయం.. పిచ్చి మొక్కలకు నిలయం



ఫుట్‌పాత్‌పై పిచ్చి మొక్కలు



పిచ్చి మొక్కలతో నిండిన స్మైల్ కార్యాలయం ఆవరణ

ఆరిలోవ: పశు సంవర్ధక శాఖకు చెందిన రాష్ట్ర స్థాయి ప్రధాన కార్యాలయం పిచ్చి మొక్కలకు నిలయమైంది. దీని ఆవరణమంతా ఎక్కడ పడితే అక్కడ పిచ్చి మొక్కలు మొలిచి అస్తవ్యస్తంగా మారింది. ఈ మొక్కల్లో పాములు చేరి కార్యాలయ ఆవరణలోకి ప్రవేశిస్తున్నట్లు సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశు సంవర్ధక శాఖలో భాగమైన స్టేట్ మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లైవ్‌స్టాక్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(స్మైల్) కార్యాలయం జాతీయ రహదారి పక్కన విమ్స్ ప్రధాన ద్వారం లోపల ఉంది. రాష్ట్ర స్థాయి అధికారిగా పశు సంవర్ధక శాఖ అడిషనల్ డైరెక్టర్ ఇక్కడే ఉంటారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో పాడి రైతులకు నిత్యం ఇక్కడ శిక్షణ ఇస్తుంటారు. పాల ఉత్పత్తి పెరుగుదల, పశు గ్రాసం పెంచడం, పశువుల పెంపకంతోపాటు కోళ్లు, పందుల ఫారాల నిర్వహణ తదితర వాటిపై రైతులకు ఇక్కడ జిల్లాల వారీగా శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. నిత్యం ఇక్కడ పాడి రైతులు, అధికారులతో సందడిగా ఉంటుంది. అలాంటి ఈ కార్యాలయ ఆవరణ అంతా పిచ్చి మొక్కలతో నిండి అధ్వానంగా తయారైంది. పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన లాన్లు మొక్కల మధ్య కనుమరుగయ్యాయి. ఆవరణలో ఉన్న పాత్ వేలు నడవడానికి వీలు లేకుండా పనికిరాని మొక్కలతో నిండిపోయాయి. ఈ మొక్కలు పాములకు నిలయంగా మారాయి. మొక్కల నుంచి తరుచూ దీని ఆవరణలోకి పాములు చేరుతున్నట్లు ఇక్కడ సిబ్బంది, శిక్షణకు వస్తున్న పాడి రైతులు భయపడుతున్నారు. విశాలమైన దీని ఆవరణలో పూల మొక్కలు, పచ్చదనం ఏర్పాటు చేస్తే అందం, ఆకర్షణీయంగా ఉంటుందని పలువురు సూచిస్తున్నారు. అధికారులు కార్యాలయ ఆవరణను శుభ్రం చేయించి పూల మొక్కలు, పచ్చదనం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

మాజీ మంత్రి గుడివాడకు నాయకుల నివాళి

ఎంవీపీకాలనీ: మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన నివాళులర్పించారు. ఎంవీపీ కాలనీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దేవరకొండ మార్కండేయులు తదితర నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లా అభివృద్ధికి గురునాథరావు చేసిన సేవలను కొనియాడారు. విశాఖ అభివృద్ధిలో ఆయన పాత్ర చిరస్మరణీయమన్నారు. ముందుగా పార్టీ నాయకులతో కలిసి అక్కయ్యపాలెంలోని గురునాథరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దాడి ఘటనలో నిందితులకు రిమాండ్

ఎంవీపీకాలనీ: అప్పుఘర్ లుంబినీ పార్కు వద్ద బుధవారం రాత్రి ఇద్దరు వ్యక్తులపై దాడికి పాల్పడిన నిందితులకు కోర్టు రిమాండ్ విధించింది. ఎంవీపీ కాలనీ క్రైం పోలీసులు తెలిపిన వివరాలిలా.. కొత్తవలస, తుని ప్రాంతాలకు చెందిన డి.బాల మురళీకృష్ణ, శ్రీనివాసరావులపై లుంబినీ పార్కు వద్ద వాసుపల్లి నవీన్, కొమర సోమరాజు, గరికిన ఎల్లాజీ, ఎద్దు రాజులు దాడి చేసి, వారి నుంచి డబ్బులు, సెల్‌ఫోన్ లాక్కున్నారు. పోలీసులు బాధితులను చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. వారి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి, గురువారం రాత్రి ఏఎస్ రాజా సర్కిల్ వద్ద అదుపులోకి తీసుకొని కోర్టుకు తరలించారు. వారికి కోర్టు రిమాండ్ విధించింది. వారి నుంచి రూ.320తోపాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

29న అంబలం పూజ

మద్దిలపాలెం: ఈ నెల 29న కొత్తవెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో అయ్యప్పస్వాముల భారీ అంబలం పూజ నిర్వహించనున్నట్టు గురుస్వాములు బాలభాస్కరశర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, సంపత్‌కుమార్ స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం 7 గంటల నుంచి కొత్త వెంకోజీపాలెం ఆంజనేయ స్వామి ఆలయం ఎదురుగా ఉన్న సర్వీస్ రోడ్డులో ఈ పూజ జరుగుతుందన్నారు. మవుడూరు సంపత్‌కుమార్ శర్మచే అయ్యప్ప స్వామి తాంత్రిక పూజ విధానం, తులసీ భాస్కర్ గురు స్వామిచే భజన కార్యక్రమాలు చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో స్వాములు, భవానీ మాలధారులు పాల్గొనాలని కోరారు.

చిరు వ్యాపారుల కోసం స్థల పరిశీలన

బీచ్‌రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డులో ఎన్నో ఏళ్లుగా చిరు వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్న షాపులను తొలగించడంతో వందల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దీంతో చిరు వ్యాపారులంతా ఆందోళన చేయడంతో వారికి వార్డులో వ్యాపారం చేసుకునేందుకు స్థలం చూడాలని జీవీఎంసీ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం జీవీఎంసీ అధికారులు వార్డులోని ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. స్థానికులకు, వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది లేని స్థలం కోసం అన్వేషిస్తున్నారు.

పాఠశాల ఎదురుగా చెత్త డంపింగ్



కేడీపీఎం స్కూల్ ముఖద్వారం ఎదురుగా పారబోసిన చెత్త

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు కేడీపీఎం స్కూల్ పరిసర ప్రాంతాలు చెత్త తో నిండిపోతున్నాయి. ఇక్కడ నివసిస్తున్న ప్రజల తీరులో ఎటువంటి మార్పు కనిపించడం లేదు. జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు కూడా విద్యార్థుల ఇబ్బందిని పట్టించుకోకుండా ఉన్నారు. వందల మంది పిల్లలు చదువుకుంటున్న ఈ పాఠశాల ముఖద్వారమే వారికి చెత్త వేయడానికి డంపింగ్ యార్డ్‌లా కనిపిస్తోంది. దీంతో స్కూల్‌లోకి దుర్వాసన ఎక్కువగా వస్తోందని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఈ సమస్యపై స్కూల్ హెచ్ఎం అనేక సార్లు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా.. వారిలో ఎటువంటి స్పందన లేదు. ఎప్పటిలానే స్థానికులు స్కూల్ ఎదురుగా చెత్తను వేస్తున్నారు. ముఖద్వారం వద్ద చెత్తను తొలగించి, దుర్వాసన లేకుండా చేయాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

కలవరపెడుతున్న ఏడాకుల చెట్లు



ఏడాకుల చెట్లకు పూసిన పుష్పాలు



కిర్లంపూడి లేఅవుట్‌లో పుష్పాలతో దర్శనమిస్తున్న ఏడాకుల చెట్లు

ఏయూక్యాంపస్: నగరవాసులను ఏడాకుల చెట్లు కలవరపెడుతున్నాయి. ప్రస్తుతం ఇవి పుష్పించే కాలం కావడంతో ఈ చెట్లు నిండా తెల్లని పువ్వులతో దర్శనమిస్తున్నాయి. చూడటానికి ఎంతో ముచ్చటగా ఉండే ఈ వృక్షాల పువ్వులు శ్వాస సంబంధమైన సమస్యలకు కారణమవుతాయని ప్రజలు భయపడుతున్నారు. ఎంతో అందంగా కనిపించే ఈ పుష్పాలను ముట్టుకోవడానికి సైతం ఇష్టపడటం లేదు. తూర్పు నియోజకవర్గంలోని అన్ని ప్రధాన మార్గాల్లో ఈ వృక్షాలు ఉన్నాయి. బీచ్ రోడ్డును ఆనుకుని ఉన్న కిర్లంపూడి లేఅవుట్ తదితర ప్రాంతాల్లో ఈ వృక్షాలు అధికంగా దర్శనమిస్తున్నాయి. అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు ఈ చెట్లు పుష్పించడం జరుగుతుంది. ఈ సమయంలో ఈ చెట్లను ప్రూనింగ్ చేస్తే పూలు వచ్చే అవకాశం, ఇబ్బంది ఉండదని, ఈ దిశగా జీవీఎంసీ ఉద్యానవన విభాగం అధికారులు కృషి చేయాలని కోరుతున్నారు.

పరస్పర సహకారంతో పోలీస్ విధులు



పోలీస్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభిస్తున్న అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

ఆరిలోవ: పోలీస్ వృత్తిలో ఉన్న వారికి పరస్పర సహకారం అవసరమని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. విశాలాక్షినగర్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానంలో అనకాపల్లి జిల్లా పోలీసులకు వార్షిక స్పోర్ట్స్ మీట్-2024 నిర్వహించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ మీట్‌ను శుక్రవారం ఎస్పీ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. శాంతి కపోతాలు, బెలూన్లు గాలిలోకి ఎగురవేశారు. స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న పోలీసులు క్రీడా పతాకాలతో ఆయనకు గౌరవ వందనం చేశారు. అనకాపల్లి, పరవాడ, నర్సీపట్నం సబ్ డివిజన్ల ఏఆర్ పోలీస్ అధికారులు, సిబ్బంది చేపట్టిన మార్చ్‌పాస్ట్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్, టగ్ ఆఫ్ వార్, తదితర క్రీడల్లో వ్యక్తిగతంగా, జట్టుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసులందరూ నియమాలు తప్పకుండా పాటించి, క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని కోరారు. పోలీసులు 365 రోజులు మానసిక ఒత్తిడితోనే విధులు నిర్వహించాల్సి ఉంటుందని, దానిని అధిగమించాలని సూచించారు. క్రీడలు పోలీసుల్లో క్రీడా స్ఫూర్తి, మానసిక స్థైర్యం, మానసిక ఉల్లాసం, ఆహ్లాదం కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు, అనకాపల్లి సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.శ్రీవాణి, పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ జి.ఆర్.ఆర్. మోహన్, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



మాట్లాడుతున్న కృష్ణా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ సాక్స్ ఆధ్వర్యంలో గురువారం ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ యువత స్వయం నియంత్రణతోపాటు మంచి జీవనశైలిని అవర్చుకోవాలన్నారు. ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ఎంతో అవసరమన్నారు. ఏపీ సాక్స్ కో ఆర్డినేటర్ రవిభాస్కర్, నాగబాబు మాట్లాడుతూ పెరుగుతున్న ఎయిడ్స్ కేసులపై అవగాహన కల్పించారు. కళాశాల జంతు శాస్త్ర అధ్యాపకుడు విజయప్రతాప్ మాట్లాడుతూ ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది, విద్యార్థులు ఎంత అప్రమత్తంగా ఉండాలనే దానిపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఐక్యూ కో ఆర్డినేటర్ రవిబాబు, పి.ఉమా మహేశ్వరరావు, ఎస్.వి.రామారావు, బి.లక్ష్మి, సాయికృష్ణ, టి.రామకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

● తెలుగు సాహితీ సదస్సులో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



దోహా వేదికగా శుక్రవారం అత్యంత ఘనంగా ప్రారంభమైన 9వ ప్రపంచ తెలుగు సాహితీ సదస్సులో ప్రత్యేక అతిథిగా పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో తెలుగు సాహితీ సౌరభాలు వెదజల్లేలా దోహా వేదికగా సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఖతార్ దేశంలో భారత రాయబారి విపుల్‌కు పలు హిందీ, తెలుగు గ్రంథాలను యార్లగడ్డ బహూకరించారు. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు సదస్సును ప్రారంభించి, నిర్వాహకులను అభినందించారు. – విశాఖ విద్య

● హెలికాప్టర్ వద్ద విద్యార్థుల సందడి



బీచ్ రోడ్డులో సిద్ధమవుతున్న హెలికాప్టర్ మ్యూజియం వద్ద పాఠశాల విద్యార్థులు సందడి చేశారు. 17 ఏళ్ల పాటు భారత నావికాదళంలో సేవలందించిన హెలికాప్టర్‌ను బీచ్ రోడ్డులోని టీయూ 142 యుద్ధ విమానం మ్యూజియం పక్కనే ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం వీటి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రోడ్డు మీదకే హెలికాప్టర్ కనిపిస్తుండటంతో దానిని తిలకించేందుకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. - ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ ఈస్ట్

9912220751

Office mail : sakshiadvtvsp@gmail.com